కళావాణి

'రసరంజని' ప్రజానాయకుడు ప్రకాశం

పోయి స్వర్గానున్న రామనాధం పుణ్యమా అని రాజమహేంద్రి ప్రేక్షకులకు రెండు అద్భుతమైన డాక్యుమెంటరీ డ్రామాలను చూపించి మరీ వెళ్ళాడు. నన్నయ సహస్రాబ్ది వత్సరాన్ని పురస్కరించుకొని సీవియస్ మహేశ్వర్ అనే ఒక పేపరు మిల్లులో పనిచేసే మెకానికల్ ఇంజనీరు చేత నన్నయ-భారతరచన' అనే డాక్యుమెంటరీ డ్రామాను తయారుచేయించి తన గురజాడ కళాసమితి సమర్పణలో ప్రదర్శింపజేసారు. దాదాపు 62 మంది కళాకారులుండే ఈ డాక్యుమెంటరీ రూపకం - పదిహేనేళ్ళక్రితం ఒక రంగస్థల అద్భుతం. చారిత్రాకాంశాలను, ఆధారాలను క్రోడీకరించి ఒక నవీన దృక్పధంతో, అలనాటి నన్నయ్యను విప్లవ కవిగా చిత్రించి చెరబండరాజును ఆయన పరంపరగా చెప్పుకొచ్చిన వ్యాఖ్యానాన్ని చక్కగా సమర్థించుకొనే ప్రయత్నం చేసి సెహభాషనిపించుకోవడమే కాక - తిరుపతి, నెల్లూరు, శ్రీహరికోట, కాకినాడ, విజయవాడ, హైదరాబాద్‌లలో ప్రదర్శించి పండిత పామర రంజకంగా ప్రదర్శనను సఫలీకృతం చేసారు. ఆతర్వాత భారత జాతీయ కాంగ్రెస్ శత వార్షికోత్సవాల్ని పురస్కరించుకొని 'స్వాతంత్ర్యోద్యమ శంఖారావం' అనే మరో డాక్యుమెంటరీ డ్రామాను సృష్టించారు. ఇది 76గురు కళాకారులతో నడిచిన ప్రదర్శన. శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు అనే టెలికామ్ ఉద్యోగి దీనికి సంకలనకర్త. దీన్నొక మహాద్భుత దృశ్య కావ్యంగా మలచారు రచయిత, దర్శకులిద్దరూ కల్సి. భారత రచన కన్నా శంఖారావం ప్రదర్శించడం చాలకష్టం. రంగస్థలంపై గాంధీజీ, నెహ్రూజీ, పటేల్, నౌరోజీ, మౌంట్‌బాటన్, నేతాజీ, దుర్గాబాయి, సరోజినీనాయుడు, లజపతి రాయ్, బిపిన్‌చంద్రపాల్, ప్రకాశం, ఒకరేమిటి ఎందరెందరు రూపకం రీత్యా కనపడాలో అందర్నీ ఆవిర్భవింపజేసారు. ప్రతీవారు రూపకళల్లోనే కాదు భావభావాలు, సన్నివేశాలు పండించే నేర్పరితనాన్ని కలబోసి - ప్రదర్శన చూపిన ప్రతీవారిలో జాతీయతా భావాన్ని, దేశభక్తినీ నూటికి నూరుపాళ్ళూ పాదుకొల్పారు.

'రసరంజని' వారు ఈ మధ్య రాజమహేంద్రిలో ప్రదర్శించిన కళాకేంద్రం వేదికపైనే 80లలో పై రెండు డాక్యు- డ్రామాలు ప్రదర్శించబడ్డాయి. ఇదిగో ఆ బాదరాయణ సంబంధు' తో ప్రకాశాన్ని పరికిద్దాం.

నిశ్చయంగా ప్రకాశం ప్రజానాయకుడే ఏమాత్రం సందేహం లేదు. రసరంజని వారి 'నాటకానికి' ప్రజానాయకుడు ప్రకాశం అన్నపేరు అక్షరాలా సరిపోయింది. దీన్ని సంకలనం చేసిన వారు ఆచార్య మొగలి నాగభూషణ శర్మగారు. సాక్షాత్తు రంగస్థల ప్రక్రియలను పోషణ పట్టిన నిత్య పరిశోధకుడు, నిరంతర శ్రామికుడు. మేధావివర్గం మనిషి. ఆంధ్రకేసరి -ఆత్మకధ - నాజీవితయాత్ర ఆధారంగా ఈ రూపకాన్ని తయారుచేసానని ఢంకాను వాయించి మరీ చెప్పారు ఆయన. జీవిత చరిత్రను ప్రదర్శన యోగ్యంగా తీర్చిదిద్దే 'స్టేజీప్లే' ప్రక్రియను కాచివడబోసిన మొగలివారు మౌలికమైన కొన్ని ప్రదానాశాలను నాటకీయతకోసం విస్మరించారేమోనన్పించిందట. ఒకటొరెండు అంశాలు ప్రస్తావించక తప్పడం లేదు. ప్రధానంగా ఇది నాటకం కాదు- డాక్యుమెంటరీ డ్రామా. రంగస్థలం పై రీళ్ళకు రీళ్ళుగా కళ్ళముందు కదలాడే దృశ్య చయనిక. దీనిలో నాందీ ప్రస్తావన లాంటి ప్రాచీన యక్షగాన ప్రక్రియను చొప్పించి - రాముడు-భీముడు'అనబడే ప్రకాశం గారి నెచ్చలులైన కంచు మర్తి రామచంద్రరావు-సారంగు భీమశంకరరావు పాత్రలచేత ప్రకాశం కథ చెప్పిస్తారు రచయిత. నిజానికి కంచుమర్తివారు జమీందారులు. తీవి, దర్పం కలబోసిన అపూర్వం పశ్య. వీధెక్కి చెట్టా పట్టాలేసికొని 'ఒరేయ్ భీముడు' అంటే ముచ్చట్లాడుకొన్న కేరక్టర్ కానేకారు. నా జీవితయాత్రలో ప్రకాశం గారు కంచుమర్తి వార్ని అందలమెక కించాడే గానీ - సారంగువారితో కల్సి ప్రకాశం కథ గానం చేసినట్లు ప్రతిక్షేపించడంలో ఔచిత్యం కల్పించింది. దీనికన్నా ఈ ప్రక్రియలో క్రొవ్విడి లింగరాజుగారి పాత్రను, తన్నేటి విశ్వనాధంగారి పాత్రను ఉపయోగించుకోవడం ఎంతో ఔచిత్యంగా ఉండు వుండేది. ఒకరు ప్రకాశంగారి ప్రభుత్వంలో పార్లమెంటరీ సెక్రటరీ గానే కాక ప్రకాశంగా నాజీవితయాత్ర నాలుగోభాగాన్ని పూర్తిచేసినవారు. పత్రికా సంపాదకులు. ఉద్యమకారుడు. అందుకే వారి పాత్రను ప్రవేశపెట్టి ఉంటే సంపూర్ణంగా అర్థవంతమయ్యేది. అలాగే తన్నేటి వారు ప్రకాశంగారి అంతేవాసి. అనేకానేక సందర్భాల్లో తన్నేటి హృదయఫలకంపై ప్రకాశం చేవ్రాలు చేసేవారు. ఒకవిధంగా ఆంధ్రకేసరికి స్పోక్స్ పెర్సన్ ఆయన. అందుకే ఈ రెండు కేరెక్టర్ల ద్వారా ప్రకాశం కథ చెప్పించడం సబబైన ఆలోచనగా రచయితకు సూచిస్తున్నాను.

మరో ముఖ్యమైన విషయం, ప్రదర్శన మొత్తంలోకే కన్నీళ్ళు పెట్టించే సన్నివేశం - ప్రకాశంగారి తల్లి మరణ దృశ్యం. దీన్ని కేవలం నాటకీయత కోసం ఉపయోగించుకొన్నదే తప్ప - సుబ్బమ్మగారి నిర్యాణకాలంలో ప్రకాశంగారు చెంతన లేరన్నది వారి జీవితయాత్ర చదివిన ప్రతీవారికీ తెల్సు. మరి ఇలాంటి స్వాతంత్ర్యాన్ని (విశృంఖలత్వాన్ని) రచయిత తీసికొని సాధించిన ప్రయోజనం ఏమిటో అర్థం కాలేదు". సుబ్బమ్మగారిలో జాతీయతాభావం, దేశభక్తీ కూడా ఉండెడివి" అని చెప్పాలనో, లేదా ప్రకాశం సోదరులకు తల్లే దైవం అని నిరూపించబడెను అనిపించుకొనడానికో మరి. తీరాచేసి బుర్రావారు ఆ సన్నివేశం అంతా తానై త్రివిధేయుడుగా మొత్తం ఆక్రమించి - అందర్నీ తలో మూలకీ విసిరేసారు. మొత్తం ప్రదర్శన అంతా "జీవనటోన్ సేవించకముందు..తర్వాత "అన్నట్టు సుబ్బమ్మగారు జీవించివున్నప్పుడు - ఆతర్వాత అన్నట్టు విడగొట్టేసుకొనేలా చేసి పారేశారాయన. అలాంటి డామినేషన్ ప్రదర్శన సమగ్రతను, సౌష్టవాన్ని ఖచ్చితంగా దెబ్బతీసే ప్రణాళిక.

మరి అదే ఇమ్మానేని హనుమంతరావు నాయుడి పాత్ర - ప్రదర్శనలో కల్సిపోయి చక్కగా అమరింది నాయుడిగారిగా శ్రీ దుగ్గిరాల సోమేశ్వర రావు ఔచిత్యం ఎరిగిన నటనను ప్రదర్శించి సెభాషనిపించుకొన్నారు. అలాగే బారిష్టర్ ప్రకాశంగా శ్రీ నడిమింటి జగ్గారావు అభినయం చాల చక్కగా ఒదిగింది. ప్రతీ ఫ్రేమునూ ఆయన పండించారనే చెప్పచ్చు.

ఇక చాట్ల శ్రీరాములు గారు ఆంధ్రకేసరిగా నటించారనడం అన్యాయం. ఆ పాత్రకు జీవం పోసారు. ఆహార్యం, ఆంగికం, వాచకం, అంతా ప్రకాశాన్ని అచ్చుగుద్దినట్టు రప్పించేసారు రంగస్థలం మీదకు. గానీ పార్శ్వదృశ్యం (సైడ్‌ప్రొఫైల్) లో ప్రకాశంగారి కారికేచర్‌గా అన్పించారే తప్ప ప్రకాశంగా చాట్ల గార్ని నప్పించలేకపోయారు. అలాంటి సమయాల్లో దర్శకుడు ప్రకాశం పాత్ర కదలికలను రంగస్థలంపై నియంత్రించడం అనివార్యమైన బాధ్యతగా గుర్తించకపోవడం విచారకరం. ప్రధానపాత్ర పోషిస్తున్న లబ్ధప్రతిష్ఠుడైన మహానటుని ఇమేజిని కాపాడాల్సిన కనీసధర్మం దర్శకునికి వుండాలి.

మేరు నగధీరుడైన ప్రకాశాన్ని 'ఆంధ్రకేసరి'గా, దేశప్రజలకు తెలియజెప్పిన సైమన్‌కమిషన్ సన్నివేశాన్ని రంగస్థలంపై 'రసరంజని' పండించలేకపోయింది. ఇక్కడ నుండి ఒకవిధంగా ప్రదర్శన అంతా పట్టు తప్పిందని భావించాలి. పాత్రధారుల ఆహార్యంలో మరింత శ్రద్ధ అవసరం.

'నన్నయ్య'ను ప్రదర్శించే సమయంలో నన్నయ, నారాయణభట్టులకే కాక రాజరాజ నరేంద్రుని కొలువులో ఉపవిష్టులైన కవి పండితులందరికీ 'శిరోముండనం' చేయించి మరీ వారికి శ్రోత్రియతను ఆపాదింపచేసిన రామనాధం - గాంధీ-నెహ్రూలాగా వసీరాం - అరుణ్ కుమార్‌లను మలచడంలో చూపించిన శ్రద్ధాసక్తులతో పోలిస్తే ప్రకాశంలో దర్శనమిచ్చిన మహానాయకులంతా "ఫర్‌దిసేక్ ఆఫ్ ..."అన్నట్టు కల్పించాలి కాబట్టి కన్పించారు. రచయిత ఆలోచనన్ని విన్పించాలి కాబట్టి విన్పించారు అనే అనిపించింది. పట్టాభి, రాజాజీ, నాడార్, చిలకమర్తి, తన్నేటి అందరూ ఆకోవలోకే వస్తారు. ప్రదర్శన నిర్వాహకులైన గరిమెళ్ళ రామమూర్తి గారు వరాహగిరి వెంకటగిరిగా, ఎన్.ఎల్.నరసింహారావు ఎన్‌జి రంగాగా ఫర్వాలేదనిపించారు.

జాతీయోద్యమంలో పాల్గొన్న కార్యకర్తల్ని, సత్యాగ్రహుల్ని జానపద కళాకారులలో చూసుకోమంటే ఎలా వాళ్ళకీ ఖద్దరు బట్టలు తొడిగించి గాంధీటోపీలు తగిలిస్తే దృశ్యానికి కొంత సార్థకత దక్కేది మరోమాట, ధైర్యం, సాహసం, త్యాగం, మూర్తీభవించిన ప్రకాశంలోని అంతర్గత ధీరోదాత్తగుణ సంపదను ప్రేక్షకుల మనోఫలకాలపై కత్తుకు పోయేలా చెప్పడానికి బుర్రకథ టెక్నిక్‌ను కొన్ని సన్నివేశాలకు పాటిస్తే బాగుండేది. ఇక, బాలప్రకాశంగా హేమ మానస చక్కని అభినయాన్ని, వాచకాన్ని ప్రదర్శించినా రూపవంతుడైన నూనూగుమీసాల కుర్రాడ్ని వెతికితే దొరక్కపోడు.

ప్రధానంగా విస్మరించి మరోఘట్టం- చైర్మన్‌గా ప్రకాశం. ప్రజానాయకుడు ప్రకాశం అంటూ ఇంత రూపకాన్ని నిర్మించి - అసలు పబ్లిక్‌లైఫ్‌కు తొలి అడుగువేసిన చైర్మన్‌గిరీని దృశ్యమానం చేయలేక పోవడం - రచయిత సామర్థ్య లోపంగా భావించనక్కర్లేదు. దాని అవసరం లేదనుకొని వుండచ్చు. కానీ ప్రకాశం తల్లి మరణించిన సన్నివేశాన్ని సవరించుకొని చైర్మన్‌గా ప్రకాశం జీవితాన్ని కూడ నాటి ప్రేక్షకునికి పరిచయం చేస్తే బాగుంటుందేమో రచయిత ఆలోచించాలి. నన్నడిగితే ఆలోచించడం అనే కన్నా అమలుజరపడం' అంటే సబబేమోననిపిస్తోంది.

ఇంతవివరంగా కొన్ని అంశాలను ప్రస్తావించింది ఎందుకంటే - ఈరూపకాన్ని మరికొన్నిళ్ళల్లో జిల్లాలో 2,3 చోట్ల ప్రదర్శింపజేయడానికి ఆలోచనలు చేస్తున్నారు. ఎస్పీ గారైతే దీన్ని కాకినాడ ఆనంద భారతిలో ప్రదర్శించాలన్న భావాన్ని వ్యక్తం చేసారు. ఆంధ్రకేసరి కాలేజీ వారైతే, తమ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేందుకు కాలేజి క్యాంపస్‌లో మరో ప్రదర్శన ఇవ్వమని కోరారు. అందుకే మరో మూడు, నాలు నెలలో బహుశా 2001లో ప్రజానాయకుడు ప్రకాశం మరోసారి ఇక్కడకు తరలివస్తారు. అప్పటికైనా ఈ సూచనల అంతరార్థాన్ని రచయితా, రసరంజని గమనిస్తే మేలు.

- నాగసుబ్రహ్మణ్యం